క్లుప్తంగా

2న అయ్యప్ప ఆలయంలో పూజలు



జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెంలో వేంచేసి ఉన్న శ్రీ హరి హర సుత అయ్యప్ప స్వామి దేవస్థానంలో స్వామివారి జన్మ నక్షత్రమైన ఉత్తరా నక్షత్రం పురస్కరించుకుని జూలై 2వ తేదీన స్వామివారికి విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. మండపారాధన, పుణ్యాహవచనం, మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు, లక్ష్మీ గణపతి హోమం, నీరాజనం, మంత్రపుష్పములు అనంతరం అన్నసమారాధన జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొనాల్సిందిగా కమిటీ సభ్యులు కోరారు.

పారిజాతగిరిలో పూజలు



పారిజాతగిరిలో భక్తులకు ప్రసాద వితరణ చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరిలో వేంకటేశ్వరస్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే సుప్రభాత సేవ మొదలుకుని తోమాలసేవ, తీర్థప్రసాదగోష్టి, ఆరాధన తదితర పూజా కార్యక్రమాలను అర్చకులు ఘనంగా జరిపారు. అనంతరం స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. తాడువాయి, పరిసర గ్రామాల ప్రజలు కాలినడకన వచ్చి స్వామి వారిని దర్శించుకున్నట్లు ఈవో కలగర శ్రీనివాస్ తెలిపారు. ఆలయానికి వచ్చిన భక్తలకు జంగారెడ్డిగూడెంకు చెందిన పల్లపోతు గోపికృష్ణ, పద్మావతి దంపతుల వితరణతో అన్న ప్రసాద వితరణ చేసినట్లు ఈవో తెలిపారు.

కూర్మావతారంలో జగన్నాథుడు



కూర్మావతారంలో భక్తులకు దర్శనమిస్తున్న జగన్నాథుడు

ద్వారకాతిరుమల: కూర్మావతారంలో జగన్నాథుడు శనివారం భక్తులకు దర్శనభాగ్యాన్ని కల్పించారు. చినవెంకన్న ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో జరుగుతున్న జగన్నాథ రథత్సవాల్లో భాగంగా స్వామివారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. అందులో భాగంగా జగన్నాథుని కూర్మావతారం భక్తులకు కనువిందు చేసింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు.

శ్రీవారి పవిత్రోత్సవాలకు రూ.2 లక్షల విరాళం



ఆలయ ఏఈఓ నటరాజారావుకు విరాళం చెక్కును అందజేస్తున్న దాత సోమరాజు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో ఆగస్టు 7 నుంచి 10 వరకు జరగనున్న పవిత్రోత్సవాల నిర్వహణ నిమిత్తం ఒక భక్తుడు శనివారం రూ. 2 లక్షలను విరాళంగా అందజేశారు. భీమవరంనకు చెందిన జీవీఎస్ఎస్‌వీ సోమరాజు ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళం చెక్కును ఆలయ కార్యాలయంలో దేవస్థానం ఏఈఓ పి.నటరాజారావుకు అందించారు.

ముందస్తు చర్యలతో పశువులకు రక్షణ



పశువులకు నట్టల నివారణ మందులు వేస్తున్న వైద్యాధికారులు

కొయ్యలగూడెం: వ్యాధుల నియంత్రణలో ముందస్తు చర్యలు తీసుకోవడం వల్ల పశువులకు రక్షణ కల్పించవచ్చని కొయ్యలగూడెం పశువైద్య అధికారి బీఆర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ఏఎంసీ యార్డ్ ప్రాంగణంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకలు, పశువులకు టీకాలు వేశారు. 900 గొర్రెలు, మేకల ఆరోగ్య పరిరక్షణకు డీ–వార్మింగ్ (పాములు మందు) మందులు వేశారు. పెంపుడు జంతువులకు థైలీరియాసిస్ వ్యాక్సిన్, యాభై ఆవులకు బ్లాక్ క్వార్టర్ వ్యాక్సిన్, 150 గొర్రెలకు బ్లూటంగ్ వ్యాక్సిన్లను అందజేశారు.

రోడ్లు ఛిద్రం.. జర భద్రం

- వర్షాలకు అధ్వానంగా ఏజెన్సీ రోడ్లు
- అవస్థలు పడుతున్న కొండరెడ్డి గిరిజనులు
- కనీస మరమ్మతులు చేపట్టాలని విన్నపాలు

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలోని మారుమూల గిరిజన ప్రాంతంలో రహదారులు అధ్వానంగా మారాయి. గత ఏడాది కురిసిన వర్షాలకు రోడ్లు తీవ్రంగా పాడైపోగా వాటికి కనీస మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో కొండరెడ్డి గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. కొంతమేర గిరిజనులు శ్రమదానం చేసి రోడ్లను బాగు చేసుకున్నప్పటికీ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అవి దెబ్బతింటున్నాయి. బుట్టాయగూడెం మండలంలోని మారుమూల గ్రామాలైన రేపల్లె, రేగులపాడు, డోలుగండి గ్రామాలతోపాటు మోదేలు గ్రామం వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతిన్నాయి. అదేవిధంగా దొరమామిడి నుంచి వీరమద్దిగూడెం వెళ్లే రహదారి కూడా పాడైపోవడంతో గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం వాతావరణలో చోటు చేసుకున్న మార్పులతో గిరిజన గ్రామాల్లో అత్యధికంగా టైఫాయిడ్, మలేరియా, కామెర్లు, డెంగీ వంటి జ్వరాల బారిన పడి గిరిజనులు అవస్థలు పడుతున్నారు. అనారోగ్యం పాలైన వారిని దొరమామిడి, బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెం ఆస్పత్రులకు తరలించాలన్నా సరైన మార్గం లేక అనేక అవస్థలు పడుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే దొరమామిడి డ్యామ్ కాలనీ నుంచి అలివేరు వరకూ కూడా రహదారి పూర్తిగా పాడైపోవడంతో గిరిజనుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి.



రేగులపాడు రోడ్డు అధ్వానంగా ఉన్న దృశ్యం



ఛిద్రమైన గొట్టాలరేవు రోడ్డు

మారుమూల గ్రామాల్లో పూర్తిగా దెబ్బతిన్న రోడ్లు

ఏజెన్సీ ప్రాంతంలో మారుమూల గిరిజన గ్రామాల్లో దాదాపు అన్ని రోడ్లు పూర్తిగా పాడైపోయాయి. పులిరామన్నగూడెం నుంచి గోగుమిల్లి వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతినడంతో కన్నారప్పాడు, ఉప్పరిల్ల, ముంజులూరు, చింతపల్లి, గోగుమిల్లి, గడ్డపల్లి, గిన్నేపల్లి, దారావాడ, తదితర రహదారులపై ప్రయాణించే గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు విస్తారంగా పడడంతో ఆయా గ్రామాలకు వెళ్లే గిరిజనుల బాధలు కూడా వర్ణనాతీతంగా మారాయి. ఐటీడీఏ అధికారులు స్పందించి రహదారుల మరమ్మతులు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

రహదారి కష్టాలు తీర్చాలి



ఏజెన్సీ మారుమూల గ్రామాల్లో దెబ్బతిన్న రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం, అధికారులు కృషి చేయాలి. కనీసం మరమ్మతులైనా చేపట్టి గిరిజనులకు రహదారి కష్టాలు తీర్చాలి. గత ఏడాది దెబ్బతిన్న రహదారులు కనీస మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో ఈ ఏడాది రహదారులు పూర్తిగా పాడైపోయాయి. ప్రతి ఏటా ఇదే పరిస్థితి. అధికారులు మరమ్మతుల పనులు చేపట్టాలి.

– సరియం రామ్మోహన్‌రావు, ఏఐకేఎమ్ఎస్ నాయకులు, బుట్టాయగూడెం

మూగ జీవాలపై హింస హేయమైన చర్య

లింగపాలెం: మూగ జీవాలను హింసించడం హేయమైన చర్య అని, అలాంటి వారికి కఠినమైన శిక్ష పడేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు, రాష్ట్ర లిడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ సొంగా సందీప్ ఒక ప్రకటనలో కోరారు. లింగపాలెం మండలం సుందరరాజుపేటలో జరిగిన ఘటన మరలా ఎక్కడ జరగకుండా నిందితులకు కఠినమైన శిక్షను విధించాలని చట్టాన్ని కోరుతున్నట్లు తెలిపారు. మిత్రదీప్ ఫౌండేషన్ ద్వారా మా వంతు సహకారం అందిస్తామని బాధిత కుటుంబానికి అండగా ఉంటామని సందీప్ తెలిపారు.

సబ్‌జైలును సందర్శించిన జూనియర్ సివిల్ జడ్జి

చింతలపూడి: మండల న్యాయ సేవ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ మధుబాబు శనివారం స్థానిక సబ్‌జైల్‌ను సందర్శించారు. నిందితుల వివరాలు, వారికి అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. వంటశాలను, స్టోర్ రూమ్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఉప కారాగార పర్యవేక్షణ అధికారి కృపానందం, జైలు సిబ్బంది ప్యానల్ లాయర్‌లు టోకూరి వెంకటేష్, పీఎల్‌వీ టీవీఎస్ రాజు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

చింతలపూడి జూనియర్ సివిల్ కోర్టులో జూలై 5వ తేదీన జరిగే మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ మధుబాబు విజ్ఞప్తి చేశారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్ సరైన మార్గమని సూచించారు. మెగా లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్, బ్యాంక్ రికవరీ, చెక్‌బౌన్స్, బీఎస్ఎన్ఎల్ రికవరీ, కుటుంబ తగాదా కేసులు, మనోవర్తి, ప్రామిసరీ నోట్ కేసులు, ఎక్సైజ్ కేసులు పరిష్కారం చేసుకో వచ్చునని తెలిపారు. రాజీ చేసుకునే వారు ప్రతి రోజు జరిగే ప్రీ లోక్‌అదాలత్ సిట్టింగ్స్‌లో కేసులు రాజీ చేసుకోవడం ద్వారా విలువైన సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. చింతలపూడి కోర్టు పరిధిలో ఉన్న నాలుగు మండలాల్లో ఉన్న కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



సబ్‌జైలులో రికార్డులను తనిఖీ చేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

కుక్కునూరు: కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో కుంజ నాగలక్ష్మి అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ తెచ్చిందన్నారు. లేబర్ కోడ్స్ వల్ల పని ప్రదేశంలో కార్మికులకు రక్షణ, ఆరోగ్య భద్రత, పని గంటలు, వారాంతపు సెలవులు తదితర హక్కులను కోల్పోతారన్నారు. ఇటీవల రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో 8 గంటల పని దినాన్ని 10 గంటలకు మారుస్తూ ఏకపక్షంగా నిర్ణయించారని, అనేక సంవత్సరాల నుంచి రాష్ట్రంలో ప్రభుత్వాలు కనీస వేతనాలు రూపాయి కూడా పెంచలేదని విమర్శించారు. కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా, డిమాండ్ల పరిష్కారానికై జూలై 9న నిర్వహిస్తున్న సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ మండల కార్యదర్శి

అతిసార వ్యాధిని అశ్రద్ధ చేస్తే ప్రాణాలకే ముప్పు

కొయ్యలగూడెం: డయేరియాపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని ఆరోగ్య కేంద్రాల్లో అమలు చేస్తున్నట్లు ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. బయ్యనగూడెం పీహెచ్‌సీ పరిధిలోని సరిపల్లి ఆరోగ్య కేంద్రంలో గ్రామస్తులకు డయేరియా లక్షణాలు, సత్వర చర్యలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మలేరియా, డయేరియాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. మూడు లేదా అంత కంటే ఎక్కువ సార్లు నీళ్ల విరోచనాలు అయితే అది అతిసార వ్యాధి అని, ఐదేళ్లలోపు చిన్నారుల్లో అతిసార వ్యాధిని అశ్రద్ధ చేస్తే ప్రాణాలకే ప్రమాదం అని హెచ్చరించారు. అతిసారా వ్యాధిపట్ల తక్షణ వైద్యం పొందాలన్నారు. కలుషితమైన నీరు, కలుషిత ఆహారం ద్వారా ఈ వ్యాధి వస్తుందని, ఈ వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటిని గాని క్లోరినేషన్ చేసిన మంచినీరు మాత్రమే వాడాలన్నారు. నిల్వ ఉన్న ఆహార పదార్థాలు, మాంసాలు తినరాదని, ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా చూసుకోవాలని, మూతలు వేసుకోవాలని తెలిపారు. నీళ్ల విరోచనాలు అయితే ఒంట్లో ఉన్న ఖనిజ లవణాలు బయటకు పోయి శరీరం డీహైడ్రేషన్‌కు గురవుతుందని, ఓఆర్ఎస్ ద్రావణాన్ని ఒక లీటర్ మంచి నీటిలో కలిపి తాగితే ప్రాణాపాయం ఉండదని అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బాషా, ఎంఎల్‌హెచ్‌పీ కె.విమలదేవి, ఏఎన్ఎం కె.గంగాదేవి, ఆశాలు కె.వెంకటలక్ష్మి, ఎమ్.వరలక్ష్మి పాల్గొన్నారు.



సరిపల్లి ఆరోగ్య కేంద్రంలో అతిసార వ్యాధి నివారణ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కృష్ణాపురం సమస్యల పరిష్కారానికి కృషి

టి.నరసాపురం: కృష్ణాపురం గ్రామంలో శనివారం ఎంపీడీవో నాగ రాజకుమారి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. బంజారా భజరంగీ బేరి సంఘం ఆధ్వర్యంలో మంచినీటి పైప్‌లైన్, రోడ్లు డ్రెయినేజీ, శ్మశాన వాటిక, ప్రాథమిక పాఠశాల అదనపు భవనం, మినీ వాటర్ ట్యాంక్ మొదలగు సదుపాయాలు కల్పించాలని వినతిపత్రం అందజేశారు. సంఘ నాయకులు భూక్యా వేణుగోపాల్, ధరావతు రవికుమార్ మాట్లాడుతూ గిరిజన నియోజక వర్గానికి గిరిజన కమిషన్ నుంచి ఐటీడీఏ నుంచి ఎలాంటి నిధులు రావడంలేదని, నిధులు మంజూరు చేయించి గ్రామ అభివృద్ధిపై దృష్టి సారించాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నాగ రాజకుమారి మాట్లాడుతూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడపించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జరభల బాలాజీ, హసావత్ వెంకటేశ్వరరావు, ధరావత్ శివరామకృష్ణ, భూక్యా రమేష్, జరభల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీడీవో నాగరాజకుమారి

ప్రోత్సాహక బహుమతుల అందజేత

జంగారెడ్డిగూడెం: పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపి పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థిని లీలా నూకరత్నంకు రూ.10,116, ద్వితీయ స్థానం సాధించిన వెంకట నాగవైష్ణవికి రూ.5,116 వారధి ట్రస్ట్ సభ్యులు అందజేశారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వారధి ట్రస్ట్ వ్యవస్థాపకులు వలవల తాతాజీ మాట్లాడుతూ విద్యార్థినులు మరిన్ని విజయాలు సాధించాలనే ఉద్దేశ్యంతో దాతల సహకారంతో ప్రోత్సాహక బహుమతులు అందించినట్లు చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన కుర్రు భరత్, జ్యోత్స్న బిందు దంపతుల వితరణతో ఈ కార్యక్రమం జరిగిందన్నారు. వారధి ట్రస్ట్ ప్రతినిధులు మద్దిపాటి శ్రీను, వెలిచెర్ల ఆనంద్, పాఠశాల హెచ్ఎం గ్లోరీ ప్రశాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినికి ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న వారధి ట్రస్ట్ సభ్యులు

వర్షం వస్తే బురద.. ఎండ కాస్తే దుమ్ము

కన్నాయిగూడెంలో రోడ్డు దుస్థితిపై నిరసన

కొయ్యలగూడెం: పొంగుటూరు, ఎర్నగూడెం గ్రామాల మధ్య రోడ్డు అధ్వానంగా తయారైందని, కొత్త రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు శనివారం రోడ్డుపై నిరసన తెలిపారు. వర్షం వస్తే బురద.. ఎండకాస్తే దుమ్ము మాదిరిగా రోడ్డు దుస్థితి మారిందని, పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కన్నాయగూడెం గ్రామ శివారు గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం కారణంగా గత ఐదేళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపించారు. హైవే నిర్మాణంలో భాగంగా అతివేగంతో ప్రయాణించే లారీల వల్ల గ్రామంలోని ఇళ్లలోకి దుమ్ము చేరుతోందని, దీని వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో జిగురు మట్టి కారణంగా రోడ్లు జారుడుగా మారి, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని వారు తెలిపారు. గ్రీన్ ఫీల్డ్ అధికారులను సమస్యలపై నిలదీస్తే సరైన సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధిక లోడుతో వెళ్లే వాహనాలపై ఆర్అండ్‌బీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వారు వాపోయారు. ఈ పరిస్థితుల నుంచి ఉపశమనం కోసం అధికారులు తక్షణమే స్పందించి కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు.



కన్నాయిగూడెంలోని ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

శ్రీవారి ఆలయంలో కోవిడ్ నిబంధనలు తొలగించాలి

ద్వారకాతిరుమల: దేశంలో ఏ దేవాలయంలోనూ లేని విధంగా ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో కోవిడ్ ఆంక్షలు ఇప్పటికీ కొనసాగిస్తూ, భగవంతుడిని భక్తులకు దూరం చేయడం సరికాదని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లంకిశెట్టి బాలాజీ శనివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. వెంటనే కోవిడ్ ఆంక్షలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తిరుమల తిరుపతిలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటం వల్ల చాలా మంది ద్వారకాతిరుమల క్షేత్రానికి వస్తున్నారని తెలిపారు. అయితే ఇక్కడ కల్యాణకట్ట, ప్రసాదాల విక్రయ కేంద్రాలు, నిత్యాన్నదాన భవనం ఆలయానికి దూరంగా ఉన్నాయని, రూములు కూడా అందుబాటులో ఉండటం లేదని, వీటి వల్ల వృద్ధులు, మహిళలు, వాహనాలు లేని భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే కొండపైన క్యాంటీన్ ఏర్పాటు చేయాలన్నారు. బ్యాటరీ వాహనాలు సైతం సరిగ్గా పనిచేయకపోవడం వల్ల భక్తులు ఎండలో నడవలేక ఇబ్బందులు పడుతున్నారని బాలాజీ తెలిపారు. దేవాలయానికి–రూములకు అనుసంధానం చేస్తూ ఉచిత బస్సులను ఏర్పాటు చేయాలని కోరారు. శ్రీవారి ఆలయంలో కోవిడ్ నిబంధనలు ఎత్తివేసి, గతంలో వలె భక్తులకు స్వామివారి దర్శనం కల్పించాలని డిమాండ్ చేశారు. వీటిపై స్పందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ శాఖ మంత్రులకు వినతిపత్రాలను పంపినట్టు బాలాజీ పేర్కొన్నారు.



లంకిశెట్టి బాలాజీ

దళితుల ఇళ్లపై యమపాశాలు

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం రాజీవ్ నగర్ కాలనీలోని దళితుల ఇళ్లపై 11 కేవీ కరెంట్ వైర్లు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. చాలా కాలంగా ఈ వైర్లు వేలాడుతూ ఉన్నాయని, వీటిని తొలగించాలని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇటీవల తీగలు తొలగించకుండా కేవలం ప్లాస్టిక్ పైపులు వేశారని తెలిపారు. వర్షాకాలంలో ఈ విద్యుత్ తీగల పట్ల స్థానికులు భయాందోళనల చెందుతున్నారు. రాజీవ్‌నగర్ కాలనీవాసులకు ఎటువంటి ప్రమాదం జరగకుముందే అధికారులు ఇళ్లపై ఉన్న 11కేవీ కరెంట్ వైర్లను తొలగించాలని కేవీపీఎస్ జిల్లా నాయకుడు అందుగుల ఫ్రాన్సిస్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకుడు కోరం దుర్గారావు, ఒగ్గు లూసమ్మ, జి. రమేష్, అంజియ్య, ముక్కమ్మ, పల్లా దుర్గ, గంథం అక్కమ్మ, కొప్పుల మంగమ్మ కోరారు.



ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ వైర్లను చూపిస్తున్న దళిత సంఘాల నాయకులు

షోకాజ్ ఇచ్చినా తీరు మారలేదా?

కె.కోట పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణపై డీపీవో ఆగ్రహం

కామవరపుకోట: కామవరపుకోట పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణపై డీపీవో అనురాధ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పంచాయతీలోని ఆయా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణను శనివారం ఆమె పరిశీలించారు. కొత్తూరులో తడి పొడి చెత్తపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీడీవో, పంచాయతీ కార్యాలయాలను తనిఖీ చేశారు. కె.కోట పంచాయతీ పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉండడంపై కార్యదర్శిపై అసహనం వ్యక్తం చేశారు. గతంలో షోకాజ్ ఇచ్చినా తీరు మారలేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మరోసారి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఇంకా మారకపోతే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఐవీఆర్ఎస్‌లో సచివాలయం 1, 2 లో పారిశుద్ధ్యం బాగోలేదని ప్రజల నుంచి స్పందన సచివాలయ 2 పరిధిలో కేవలం 33శాతం సంతృప్తి నిచ్చిందని, సచివాలయం 3లో అసంతృప్తిగా ఉందన్నారు. స్థానిక జూనియర్ కాలేజీ దగ్గర ఉన్న డంపింగ్ యార్డుతో ప్రజలకు తీవ్ర అసౌకర్యం, తీవ్రమైన కాలుష్యంతో ప్రజలకు ఇబ్బందిగా ఉందని గతంలో వేరే చోటకు మార్చమని చాలా సార్లు చెప్పానని అన్నారు. తడి, పొడి చెత్త వేరే చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. దీనిపై జూలై 1 నుంచి జరిగే గ్రామసభలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ పంచాయతీలో 21 మంది పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నా రిక్షాలు ఎందుకు కొనరని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.సరళకుమారి, రిసోర్స్ పర్సన్ డి. రంగనాయకమ్మ, సర్పంచ్ అనూష భాగ్యరాజ్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



కొత్తూరులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ అనురాధ

నూతన కమిటీ సభ్యులకు అభినందనలు



పార్టీ పదవులు పొందిన నేతలను అభినందిస్తున్న దృశ్యం

టి.నరసాపురం: వైఎస్సార్ సీపీ టి.నరసాపురం మండల కమిటీని పార్టీ రాష్ట్ర కమిటీ నియమించడంపై ఆ పార్టీ నేత, స్వచ్ఛ సేవా ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పెండ్యాల అభిషేక్ బాబు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ పదవులు పొందిన బొర్రంపాలెం గ్రామస్తులు నల్లమిల్లి శ్రీను, పల్లా రమేష్, రాజబోయిన రమేష్, కలపర్తి రాజశేఖర్‌లను అభిషేక్ బాబు పూలమాలలతో సత్కరించి అభినందించారు. పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో బత్తుల రమేష్, ముత్యాల వెంకటేశ్వరరావు, గుండె చిట్టియ్య, కొనకళ్ల సర్వేశ్వరరావు, చిల్లర ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ అధికారిణికి సత్కారం



గ్రంథాలయ అధికారిణి బంగారు పాపను సత్కరిస్తున్న పాఠకులు

ద్వారకాతిరుమల: స్థానిక శాఖా గ్రంథాలయ అధికారిణి గుర్రం బంగారుపాప గుండుగొలను గ్రంథాలయానికి బదిలీ అయిన సందర్భంగా పాఠకులు శనివారం ఆమెను ఘనంగా సత్కరించారు. ముందుగా దుశ్శాలువాను కప్పి, పూలమాలలు వేశారు. అనంతరం నూతన వస్త్రాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక సచివాలయం మహిళా పోలీస్ పి.లక్ష్మీ సుజన, గ్రంథాలయ సహాయకురాలు బి.మణి, సీఆర్ఎంపీ అశోక్, ద్వారకాతిరుమల నూతన గ్రంథాలయ అధికారి ఎన్‌సీహెచ్ రామకృష్ణ తదితరులున్నారు.

వినతుల స్వీకరణ

టి.నరసాపురం: మండలంలోని కృష్ణాపురంలో శనివారం ధర్తి ఆబ జన్‌భగిదరి అభియాన్ కార్యక్రమాన్ని ఎంపీడీవో నగరాజకుమారి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ షెడ్యూల్ తెగల వారికి ప్రభుత్వం అందిస్తున్న సేవలు, కార్యక్రమాల గురించి వివరించారు. అలాగే ప్రజల నుంచి పలు సమస్యలపై వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీఎస్ సాయిబాబ, ఏవో జి.మణికుమారి, మండల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలివ్వాలి

జంగారెడ్డిగూడెం: పేదలు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మైసన్నగూడెం గ్రామంలో సర్వే నెంబర్ 120/2లో పేదలు సాగు చేస్తున్న భూమిని ఆయన జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కొన్నేళ్లుగా మామిడి, జీడి, జామాయిల్ తదితర పంటలు సాగు చేసుకుంటున్నా పేదలను గ్రామాల్లో ఉన్నటువంటి భూస్వాములు, అధికార పార్టీ నాయకులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. చట్టం ప్రకారం పేదలు సాగు చేసుకుంటున్న భూమికి, పేదలకు రక్షణ కల్పించవలసిన బాధ్యత రెవెన్యూ, పోలీసు యంత్రాంగాలపై ఉందన్నారు. కార్యక్రమంలో పులపాకుల వీర్రాజు, పిల్లి పోతురాజు పి.వెంకట సుబ్బారావు, జి.సూర్య కిరణ్, కాకుల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ



ఊటసముద్రం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేస్తున్న దృశ్యం

చింతలపూడి: డీపర్ లైఫ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఊటసముద్రం ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం 90 మంది విద్యార్థులకు రూ.10 వేల విలువైన నోట్ బుక్స్, విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. నిర్వాహకులు బుచ్చిబాబు మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో ఏటా రూ.50 వేల విలువైన విద్యా సామగ్రిని పేద విద్యార్థులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు కనిపెడ కాంతారావు, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.